


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

## 117

**(22 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పోస్టల్ డిపార్టుమెంటువారు** రేట్లు ఎంత పెంచినా ఉత్తరాల మీద మమకారం ఏమీ తగ్గలేదు ప్రజల్లో, ఎలా తగ్గుతాయి? దూరంగా వున్న బంధు మిత్రులతో సంబంధాలు పెట్టుకోవాలంటే ఉత్తరాలేకదా ఉన్న మార్గం.

వెనుకటిలాగా చెయ్యి జాడించి వ్రాయకపోయినా సగానికి సగమైనా పోస్టు నడుస్తూనే వుంటుంది కదా! మొన్న ఒకాయన అన్నాడు "ఇదివరలో పిల్లగాని, పిల్లవాడు గానీ పుడితే బంధుమిత్రులందరికీ వ్రాసేవాణ్ణి. సుమారు నూటయాభై ఇన్‌లాండు కవర్లయ్యేవి. కేవలం కార్డులమీద 'సంతాన ప్రకటన' బాగుండదని అలా వ్రాసేవాణ్ణి.

"ఈసారి ఆడపిల్ల పుట్టింది. జాబితా రెండు రోజులు పరిశీలించి యాభై తగ్గించాను. మిగిలిన వందనూ రెండు భాగాలు చేశాను. ఒక యాభై పల్లెటూళ్ళకు వ్రాసేవి ఉన్నాయి. వాటిని మాత్రం కార్డుల మీదే వ్రాశాను. బస్తీలలో వాళ్ళకు బాగుండదని ఇన్‌లాండు కవర్లు వాడాను. అంత కన్నా ఏం చేస్తాం చెప్పండి. సంతోష వార్త ఎక్కడ దాచగలం?" అని.

నిజమే. ఏ కాస్త విషయం వచ్చినా మనవాళ్ళకు తెలియచెయ్యాలనే ఉబలాటం ఉంటుంది. మనం వ్రాస్తేగాని వాళ్ళు వ్రాయరుకదా? నిజానికి చాలామందికి మనం వ్రాసినా జవాబు వ్రాయరు. "మీ వద్దనుంచి ఉత్తరాలు లేవు" అంటూ మనమే రిమైండర్లు కొడుతూ ఉండాలి. అది మన తృప్తికోసమే గాని వారిని కదిలించడం మాత్రం జరగదు.

ఈ మధ్య చాలామంది ఎలాంటి విషయాన్నైనా సరే కార్డులో ఇరికించి వ్రాయడం నేర్చుకున్నారు. అది గొప్ప ఆర్టుగా కూడా పరిణమించింది. ఉన్న విషయాన్ని కుదించి పడికట్టు పదాలు లేకుండా చేసి చెప్పడం చినదాన్ని చందస్సుల బిగించి వ్రాయడం ఇందులో ప్రత్యేకత. అక్కడికే అలసిపోయినట్లు చివర "ఉంటా"నంటారు. ఉండక ఉత్తరం వెంట పరుగెత్తుకు వస్తా? వస్తే చిక్కేం వుంటుంది?

కొందరు జాగ్రత్తగా ఉత్తరాలు వ్రాయడం మాత్రం వ్రాస్తారు. వాటిని పోస్టు చెయ్యడం మాత్రం జరగదు. వారం పదిరోజులన్నా జేబులోనో, టేబుల్ మీదో నిద్రపోతాయి. ఇంతలో ఎవరికి ఉత్తరం వ్రాశారో వారు రావడం తటస్థించవచ్చు. అప్పుడు తాము వ్రాసిన ఉత్తరం మాట జ్ఞాపకం వచ్చి -

"అబ్బే వ్రాసి వారం రోజులైంది. కావాలంటే తారీఖు చూడండి. పోస్టులో వెయ్యడమే ఆలస్యమైంది. ఇది ఆ రోజే పోస్టులో వేసి వున్నట్లయితే మీకు ఆరు రోజుల క్రింద అందివుండేది" అని చెపుతూ ఉంటారు.

కొందరు అవతలి వారివద్దనుంచి ఉత్తరం వచ్చిన తర్వాత ఉలిక్కిపడి తాను వ్రాసిన ఉత్తరం పనిమనిషినో, ప్రక్కింటి కుర్రవాణ్ణో బతిమాలి పోస్టాఫీసుకు పరుగెత్తిస్తూంటారు. నేనూ ఉత్తరాలు త్వరగానే వ్రాస్తాను గానీ పోస్టాఫీసుకి పంపడమే జాప్యమవుతూ ఉంటుంది. మా యింటికి పోస్టాఫీసుకి చాలా దూరం. ఉత్తరాలు పుచ్చుకుని పొరుగూరి ప్రయాణంలాగా బయలుదేరాలి. మధ్యలో ఎక్కడా పోస్టల్ వారి ఎర్రడబ్బా ఒక్కటైనా కనిపించదు.

అందువల్ల అవతలివారిచేత మాట అనిపించుకోవలసి వస్తుంది. బద్ధకస్తుడనీ, ఉత్తర ప్రత్యుత్తరాలకు సమబంధించిన మర్యాదలు బొత్తిగా తెలియవనీ ఒక మిత్రుడు సలహా యిచ్చాడు.

"పోనీ రోజు కో ఉత్తరం వ్రాయండి. సాయంత్రం పూట  షికారు అనుకుని బయలుదేరండి, రెండు పనులూ కలిసి వస్తాయి" అని. పోస్టులో ఉత్తరాలు వేయడానిక్కూడా అంత ప్రయత్నం చేయాలంటే కష్టం. షికార్ల మీద మమకారం ఏనాడో పోయింది. పుణ్యదినాలనాడు గుడిలో రథం బయలుదేరినట్లు ఎప్పుడోగాని ఇల్లు వదిలి వెళ్ళడం అంటూ ఉండదయ్యె.

ఈ బద్ధకం వల్ల కొన్ని తమాషాలు జరుగుతూ ఉంటాయి. ఎవరన్నా మాట్లాడటానికి యింటికొస్తే వారు బయలుదేరేముందు "ఇప్పుడు ఎటు మీరు వెళ్ళరా?" అని ప్రశ్నించడం, వారు ఖర్మం చాలక పోస్టాఫీసు వైపే వుంటే

"చూడండీ మీకు పని చెప్పకూడదు. అయినా ఇవ్వాళ తప్పదు. ఈ ఉత్తరం కొంచెం పోస్టుకంతలో పారేసి చక్కాపొండి. చీటీ అంటిచాలెండి. మరేం లేదు. ఏదో పెళ్ళిసంబంధానికి సంబంధించిన ఉత్తరం. వాళ్ళు దీనికోసం ఎదురుచూస్తూ ఉంటారు. అందుకని మీకు చెప్పాల్సి వచ్చింది. ఏదో పుణ్యకార్యం అని అతగాడి నెత్తికి కొంచెం 'సెంటిమెంటు తలపాగా" చుట్టి ఉత్తరం అప్పగించడం జరుగుతూ ఉంటుంది.

ఇలా సామాన్యంగా మా యింటికి వచ్చేవారందరికీ 'టపా మర్యాదలు' జరిగినాయి. అందువల్ల ఇప్పుడు ఎవరన్నా 'ఎటు వెడుతున్నారు?' అని అడిగినా "ఎటో చెప్పలేం. ఎలక్ట్రిసిటీ బిల్లు ఒకటి కట్టాలి. పిల్లల జీతాలు కట్టాలి. ఇంటికి వెచ్చాలు పట్టుకెళ్ళాలి" అంటూ దండకం చదివి తప్పించుకుంటున్నారు.

ఒకాయన చటుక్కున మర్యాదగా ఇలా చెప్పాడు. "నాకు ఉత్తరాలు పోస్టులో వెయ్యడం అలవాటు లేదు. అవి తీసుకున్నా ఎప్పుడూ జేబులోనే ఉంటాయి. అందుకని నేనెప్పుడూ యింటిదగ్గర వ్రాయను. అంతగా అవసరమైతే పోస్టు ఆఫీసుకి వెళ్ళి అక్కడే రెండుముక్కలు గీకిపారేసి వస్తా. పని త్వరగా తేలుతుంది. తరువాత పోస్టాఫీసు ధ్యానం తప్పుతుంది" అని.

ఎప్పుడూ అనుకుంటూ వుంటా ఇల్లు అద్దెకు తీసుకున్నప్పుడు పోస్టాఫీసుకి దగ్గరలో తీసుకుందామని. అలా ఎప్పుడూ కుదరలేదు. ఒకసారి పట్టుబట్టి అలా తీసుకున్నాను. ఒక నెల రోజుల్లో అందరికీ ఉత్తరాల సంతర్పణ చేశాను. రెండో నెలలో పోస్టాఫీసు అక్కడ ఇరుకుగా ఉందని ఎత్తివేసి ఆ పేట చివర ఎక్కడో పెట్టారు.

నిజం చెప్పాలంటే ఉత్తరాలు వ్రాయడంకన్నా వాటిని అందుకోవడంలో ఎక్కువ ఉత్సాహం ఉంటుంది. మనం వ్రాయకపోతే మాత్రమేం, వాళ్ళు వ్రాస్తూ ఉండకూడదూ. బాకీ ఉంచుకుంటామేమిటి? ఎప్పుడో అప్పుడు పెద్ద ఉత్తరం వ్రాయం? అనిపిస్తుంది. వారపత్రికలలాగా వాళ్ళు వ్రాస్తూ వుంటే సంవత్సర సంచికల్లాగా మనం వ్రాయాలనిపిస్తుంది. కాని ఎవరు అలా వ్రాసేది.

ఒక్క ఉత్తరానికి జవాబు వ్రాయడం కొంచెం ఆలస్యమైతే "ఏమిటి మీ దగ్గర నుంచి జవాబు రాలేదు. మేమంటే యిష్టం లేదా? ఏదైనా కోపం వచ్చిందా? తాపం హెచ్చిందా? మా ఉత్తరాలలో ఏ వాక్యమైనా మీకు నచ్చలేదా? అసలు మా ఉత్తరాలంటేనే మీకు "ఎలర్జీ"గా మారాయా? పోనీ కారణమన్నా వ్రాసి మానుకోండి. కొంత సంతృప్తిగా ఉంటుంది" అంటూ వ్రాస్తారు.

అప్పుడన్నా పని పెత్తుకుని పెద్ద ఉత్తరం వ్రాయక తప్పదు. అంటే ఏమన్న మాట? జవాబులు ఆలస్యం చేస్తే అవతల వాళ్ళకు మనమీద వున్న అభిమానం పోగుట్టుకోవడమేగా, కనుక ఉత్తరాలు వ్రాయడంలో బద్ధకించడం పట్టు తివాచీలలాగా పరుచుకున్న బాంధవ ముద్రల్ని చుట్టి చూరుకు వ్రేలాడే కట్టడమే అవుతుంది.

ఉత్తరాలు చేసే మేలు, కల్పించే ఆనందం ఎంతో ఉంది. అందుకనే లేఖలు స్వర్ణరేఖలు అన్నారు పెద్దలు. వీటి తమాషాలు మరి కొన్నిటిని ఈసారి.

Post your comments